

## తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు చేకూర్చే ఉపాధి అవకాశాలను పరిశీలించాలి: కలెక్టర్

-4లో

10 YEAR ANNIVERSARY 2014 - 2024

పెన్ పవర్

ఉభయ గోదావరి

కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# అంబులెన్స్‌లు లేక అవస్థలు! ఉన్న వాహనాలపై అదనపు భారం..

**-పేషంట్ల తరలింపునకు తప్పని ఇక్కట్లు.**

**- 11 మండలాలకు 8 అంబులెన్సులు.**

**-ఎమ్మెల్యే శిరీష దేవికి ఏజెన్సీ ప్రజలు అభినందనలు..**








**దేవీపట్నం,పెన్ పవర్,సెప్టెంబర్26:**అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం లో అవసరానికి సరిపడా 108 అంబులెన్స్ వాహనాలు లేక రోగులు అవస్థలు పడుతున్నారు.ఏజెన్సీలో వైద్య సేవలో ఆలసత్వం కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుంది.గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు తీరుతో మంజూరు కావాల్సిన అంబులెన్సులు కూడా రాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.పలుమార్లు ప్రజాప్రతినిధులు కోరిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.ఫలితంగా పేషంట్ల తరలింపునకు తీవ్ర ఇబ్బందులకు తలెత్తుతున్నాయి.

**ఉన్నవాటిపై అధిక భారం..**

రంపచోడవరం నియోజకవర్గంలో 7 మండలాలకు 1ఏరియా ఆసుపత్రికి,19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు,8 అంబులెన్స్ లతో సేవలందించడం ఇబ్బందిగా మారింది.అంబులెన్సు కొరత కారణంగా అందుబాటులో ఉన్న వాటిపై తీవ్ర పనిభారం పడుతుంది.ఏజెన్సీలోని దేవీపట్నం మండలానికి ఉండవలసిన అంబులెన్స్ ని మైదాన ప్రాంతంలో ఉన్న గోకవరం ఆసుపత్రికి ఒక్కటే అంబులెన్స్ కావడంతో పేషెంట్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో పేషెంట్లకు సకాలంలో వాహనాలు రాక ప్రైవేటు వాహనాలు ఆశ్రయించి,ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

**108 సిబ్బందితో అంతులేని సమాధానం..**

రంపచోడవరం,గంగవరం,అడ్డతీగల,రాజవొమ్మంగి మండలాలలో కొత్తగా ఏర్పాటు చేసిన హైవేపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.దీనికి తోడు రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి వచ్చే సీరియస్ కేసులు రాజమండ్రి,కాకినాడ,రిఫర్ చేస్తుంటారు.మెరుగైన వైద్య సేవల కోసం పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేసినప్పుడు,పేషంట్ల తరలింపునకు అంబులెన్సు అందుబాటులో ఉండడం లేదు.బాధితులు 108 కు కాల్ చేస్తే వాహనాలు ఇతర ప్రాంతాల్లో బిజీగా ఉన్నాయని,కొద్దిసేపట్లో తిరిగి కాల్ చేసి అందుబాటులోకి తెస్తామని సమాధానాలు వస్తున్నాయి.

**డెడ్ బాడీల తరలింపునకు వాహనాలు కరువు....**

రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు,వైద్య పరికరాలు ఉన్నప్పటికీ ఏరియా ఆసుపత్రి పరిధిలో ఏడు మండలాలకు డెడ్ బాడీ ల తరలింపునకు వాహనాలు కరువయ్యాయి. పోస్టుమార్టం తదుపరి మృతదేహాలను బాధిత కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనాల్లో తరలించుకోవలసి వస్తుంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి రంపచోడవరం నియోజకవర్గం లో పేషెంట్లు ఇబ్బందులకు గురికాకుండా సరిపడా అంబులెన్సు ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుకుంటున్నారు.

**ఎమ్మెల్యే శిరీష దేవికి అభినందనలు....**

రంపచోడవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన గిరిజన మహిళ శిరీష దేవి ఏజెన్సీలో గిరిజన ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి అధికారంలోకి రాగానే తమ సొంత ఖర్చులతో అంబులెన్స్ ఏర్పాటు చేసి ఏజెన్సీ ప్రజలు,మైదాన ప్రాంతాల నుండి,మరియు ఏజెన్సీ ఆసుపత్రి నుండి డెడ్ బాడీలను,ఎమ్మెల్యే సొంత ఖర్చులతో తరలించేందుకు వీలుగా అంబులెన్స్ ఏర్పాటు చేశారు.అంబులెన్స్ ఏర్పాటుకు కృతజ్ఞతగా ఏజెన్సీ లోని గిరిజన ప్రజలు ఎమ్మెల్యే శిరీష దేవికి అభినందనలు తెలియజేశారు.

## గర్భిణీలు ప్రతిరోజు
# పౌష్టికాహారం తీసుకోవాలి







## -మంత్రి సుభాష్.

**రామచంద్రపురం/అమలాపురం పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 26:** ఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణీలు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. గురువారం ఉదయం రామచంద్రపురం పట్టణం లైన్స్ క్లబ్ కళ్యాణమండపంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మొదట గా రామచంద్రపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యూట్రిషన్ స్టాల్స్ లో ప్రదర్శనకు ఉంచిన పౌష్టికాహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణీ స్త్రీలు ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు బాలింతలలో రక్తహీనతను నివారించే పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడమే పౌష్టికాహార మాసోత్సవాల ముఖ్య ఉద్దేశం అన్నారు.గర్భిణీ స్త్రీలు బాలింతలలో రక్తహీనతను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. బాల సంజీవని స్కీం ద్వారా అనుబంధ పోషకాహారం అందిస్తున్నామని.. గర్భిణీలు బాలింతలకు బాల సంజీవని పోషకాహార కిట్టును ఇవ్వడంతోపాటు.. కోడిగుడ్లు పాలు బియ్యం నూనె పప్పు వంటివి ప్రతినెలా అందిస్తున్నామన్నారు. చిన్నపిల్లల్లో పోషకాహార లోపాల వల్ల అనారోగ్యాల బారిన పడకుండా బాలామృతం ఫుడ్ బ్యాగ్ తో పాటుగా కోడిగుడ్లు పాలు ప్రతినెల అందిస్తున్నామని తెలిపారు. బాలామృతంతో ఎలాంటి ఆహార పదార్థాలు తయారు చేసుకోవాలో తెలియక వృధా అవుతున్న నేపథ్యంలో బలామృతంతో వివిధ రకాల రుచికరమైన ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించడానికి ఆహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శనలు ఉంచామన్నారు. గర్భిణీలు బాలింతలుగా ఉన్నప్పుడు వారు తీసుకునే ఆహారం మీదనే తమ పిల్లల ఆరోగ్య భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు.సరైన పౌష్టికాహారం తీసుకోకపోతే పిల్లలకు పోషకాలు అందక అనారోగ్యాల బారిన పడతారని.. అనారోగ్యంతో జన్మించిన శిశువుల తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతమన్నారు.ఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణీలు ప్రతిరోజు కొంచెం సేపు నడవాలని తెలిపారు. చిన్నపాటి వ్యాయామాలు రోజు చేయాలన్నారు. అనంతరం మంత్రి అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సిడిపిఓ వరాహ లక్ష్మి, అంగన్వాడి యూనియన్ లీడర్ దుర్గ అంగన్వాడీ టీచర్లు కార్యకర్తలు , ప్రజా ప్రతినిధులు గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ లీకేజీలను గుర్తించి వెంటనే
# అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉండాలి.





## -కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్.

**అమలాపురం పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్26:** డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లాలో చమురు సహజ వాయు వు నిక్షేపాలను వెలికి తీస్తూ సరఫరా చేస్తున్న సంస్థలైన గ్యాస్ అథారి టీ ఆఫ్ ఇండియా, చమురు మరియు సహజ వాయుల సంస్థ, కెయిన్ ఎనర్జీ వేదాంత తదితర సంస్థలకు సంబంధించిన పైప్ లైన్లకు లీకేజీలను ఎప్పటి కప్పుడు గుర్తించి వెంటనే అరికట్టే దిశగా చమురు సంస్థలు, జిల్లా అగ్నిమా పక స్పందన సంస్థలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదే శించారు. గురువారం గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు జిల్లా అగ్నిమాపక స్పంద న సంస్థ అధికారులతో స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్ నందు సమా వేశం నిర్వహించి చమురు సహజ వాయు వుల వనరుల లభ్యత ప్రాంతాలు వాటిక అనుబంధంగా ఏర్పాటు చేసిన గ్యాస్ పైప్ లైన్లు, ఇంటర్మీడియట్ స్టేషన్లు, గ్యాస్ వినియోగించే కంపెనీలు, గ్యాస్ లీకేజీ లు నివారణపై తీసుకుం టున్న చర్యలు గూర్చి ఆరా తీశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లాలో ఉన్న అన్ని చమురు గ్యాస్ నిక్షేపాలను వెలికి తీసి సరఫరా చేస్తున్న సంస్థలు ఆయా పైప్ లైన్లను మ్యాపింగ్ చేసి జిల్లా అగ్నిమాపక స్పందన సంస్థల స్టేషన్లో కూడా అందించాలని లీకేజీ సందర్భంలో ఫిర్యాదు అందిన వెంటనే ఆ యొక్క ప్రాంతాలను సులభతరంగా గుర్తించి గ్యాస్ మంటలను త్వరితగతిన అదుపు లోనికి తెచ్చేందుకు వీలుగా ఈ మ్యాపింగ్ ఉపకరిస్తుందన్నారు. గ్యాస్ చమురు సంస్థలు వారి జంక్షన్ పాయింట్లు ఇంటర్మీడియట్ స్టేషన్లో తదితర లీకేజ్ ఏర్పడడా నికి అవకాశం ఉన్న స్పాట్లను మ్యాపింగ్ చేస్తూ నివేదిక రూపొం దించాలని ఆదేశించారు. ఒక కాపీని అగ్రిమాపక స్పందన సంస్థకు తప్పని సరిగా అందించాలని ఆయన స్పష్టం చేశారు. పైప్ లైన్లు లీకేజీ సమ స్యలు ఉత్పన్నంకాకుండా నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు స్థానిక ప్రజానీకం ఎటు వంటి భయాందోళనలకు గురికాకుండా పైప్ లైన్లు నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్ట పర చాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా అగ్నిమాపక విపత్తు స్పందన అధికారి ఎన్ పార్థసారథి, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థకు చెందిన సీనియర్ మేనేజర్ సుందర్ కుమా ర్, సీనియర్ ఫైర్ సేఫ్టీ అధికారి అభిషేక్ తదిత రులు పాల్గొన్నారు

# ఇసుక రవాణాకు వాహనాలను నమోదు చేసుకోవాలి



## - కలెక్టర్ నాగరాణి
## వాహన యజమానులతో కలెక్టర్ సమావేశం

**పోడూరు, పెన్ పవర్, సెప్టెంబర్ -26::**ఇసుకను రవాణా చేసేందుకు వాహనాలను నమోదు చేసే ప్రక్రియలో భాగంగా యజమానులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగరాణి టిప్పర్ల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో భాగంగా ఇంటికి ఇసుక డోర్ డెలివరీ చేసే టిప్పర్లు డిపాజిట్ చెల్లించడం, అఫిడవిట్ రూపంలో ఒప్పందం చేసుకోవడం వంటివి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలని, టిప్పర్లకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇసుక రవాణాకు వినియోగించే టిప్పర్ల రిజిస్ట్రేషన్ కు వెంటనే దరఖాస్తు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఇసుక రవాణాలో వినియోగదారులకు ఏ విధమైన ఇబ్బంది లేని విధంగా ఇసుక రవాణా వెంటనే చేపట్టాలని టిప్పర్ల యజమానులను జిల్లా కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ జె.ఉదయ భాస్కరరావు, ఆర్డీవో పి.ఉమామహేశ్వరరావు, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి జి. జయ ప్రసాద్, టిప్పర్ల యజమానుల సంఘాలకు చెందిన రావూరి రాజా, బండారు సత్తిబాబు, కౌరు నాగరాజు, కోలా సత్యనారాయణ, బండారు శ్రీనివాస్, యాతం గణపతి, ముచ్చర్ల వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందుకున్న మెర్ల చంద్రావతి

- ప్రజలకు సాయం చేయడంలో కూటమి ప్రభుత్వం ముందు ఉంటుంది.ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 26** ముఖ్యమంత్రి సహాయ నిధికి నుండి వైద్యం రీఎంబర్స్మెంట్ నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామానికి చెందిన మెర్ల చంద్రావతికి 40 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం ఆయన నివాసం వద్ద ఆమె కు చెక్కును అందజేస్తారు .గతంలో ప్రమాదవశాత్తూ గాయపడి వైద్యం చేయించుకున్న ఖర్చులు తిరిగి రావడంతో చంద్రావతి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, సత్యానందరావుకు ధన్యవాదాలు తెలియజేశారు.నియోజకవర్గానికి సంబంధించి దరఖాస్తు చేసిన వాటిలో మొదటిగా వచ్చిన చెక్కును చంద్రావతికి అందించామని,పేదలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని సత్యానందరావు అన్నారు.ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ - మెర్ల రాము , గ్రామ టిడిపి అధ్యక్షులు మల్లవరపు నాగరాజు, మెర్ల లక్ష్మీపతి, గుండుబోగుల రామకృష్ణ, కొమ్మర వీర రాఘవులు, మెర్ల అప్పన్న, మెర్ల సూరిబాబు, మెర్ల వెంకటేశ్వరరావు, మెర్ల అప్పన్న సూర్యరావు, మెర్ల వెంకటేశ్వర్లు,దేగల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పాపలకు పెద్ద మనస్సు



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**తాళ్లపూడిలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదువుచున్న అన్నదేవరపేట గ్రామానికి చెందిన 6వ తరగతి విద్యార్థిని పిట్టా నిత్యా వాస్, 3వ తరగతి విద్యార్థిని పిట్టా రియా వాస్ అనే వీరిద్దరు అక్కాచెల్లెళ్ళు దాతృత్వం చాటుకున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులను కిడ్డీ బ్యాంక్ లో దాచుకొని ఆ మొత్తం 2500 రూపాయలను విజయవాడ వరదభాధితుల సహాయార్థం ఆ స్కూల్ కరస్పాండెంట్ వి.వి.అనీష్ కి గురువారం అందచేయటం జరిగినది. ఈ ఇద్దరు అక్కాచెల్లెళ్లు తోటి విద్యార్థిని, విద్యార్థులను, అలాగే ప్రజలందరు కూడా స్పందించి విజయవాడ వరద బాధితులకు సహాయ, సహకారాలు అందజేసి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో వారి తల్లిదండ్రులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర .ఎస్సీ సెల్ సహాయ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, అనందకుమారి పాల్గొనటం జరిగినది.

## జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,సెప్టెంబర్ 26:**జలజీవన్ మిషన్ పనులను స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. పని పది తరాలకు ఉపయోగపడే విధంగా ప్రతి పని ఉండాలని ఆయన కోరారు. పెంటపాడు మండలం యానాలపల్లి, ఉమామహేశ్వరం గ్రామాల్లో ఆయన ఒక్కో గ్రామానికి రూ.99 లక్షల చొప్పున పైపులైన్ల పనులకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లపాటు నిర్వీర్యమైన గ్రామపంచాయతీలు, సర్పంచులకు కూటమి ప్రభుత్వం పునర్ జీవం అందించిందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చూసేందుకు తమను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునే బాధ్యత సర్పంచులు తీసుకోవాలన్నారు.రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి నియోజకవర్గంలో ప్రతి గ్రామం సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. జనసేన టిడిపి బిజెపి నాయకులు అధికారులకు వారధిగా మారి ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యుఎస్ డి ఇ సర్వేశ్వరరావ్, సర్పంచ్ గోక ఛాయాదేవి, ఉమామహేశ్వరం కూటమి నాయకులు నాయకులు పాల్గొన్నారు.

## ముళ్ళపూడి వెంకటరత్నంకు నివాళులర్పించిన నాయకులు



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, సురేంద్రల తండ్రి ముళ్ళపూడి వెంకటరత్నం ఇటీవల మరణించటం జరిగింది. ఈ నేపథ్యంలో గురువారం తాళ్ళపూడి మండలంలోని తాడిపూడి గ్రామానికి చెందిన నాయకులు నామా సురేంద్ర కుమార్, తిరుమలశెట్టి సత్యనారాయణ, అక్కాబత్తుల కరుణాకర్, లక్ష్మణ్ కుమార్, కామిశెట్టి సాయి, గుర్రం శ్రీధర్ తదితరులు ముళ్ళపూడి వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# లభ్యం కానీ మృతదేహం





### -వర్షం కారణంగా గాలింపుకు అంత రాయం
### -ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్ పరిశీలన

**మారేడుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 26:-** నాలుగు రోజులుగా హహర్నిశలు శ్ర మించి న వైద్య విద్యార్థి మృత దేహం లభ్యం కాలేదు.వాగులు, వంకలు పోలీ సులు, ఎన్. డి. ఆర్. ఆఫ్. అగ్ని మపాక, అటవీశాఖ, పోలీస్ జగిలాం, డ్రోన్ కెమెరా లతో సిబ్బంది బృందలుగా ఏర్పడి నాలుగు రోజులుగా గాలించి నప్పటికీ ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదు. మరోపక్క వర్షాలు కురుస్తుండడంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడుతుంది. గురువారం ఐ. టి. డి. ఏ. ప్రాజెక్ట్ అధికారి కట్ట. సింహచలం,, సబ్ కలెక్టర్ కల్పశ్రీ గాలింపు చర్యలను పరిశీలించారు.
భారీ వర్షం కురవడం తో గాలింపును శుక్రవారం నికి వాయిదా వేశారు. ప్రకృతి అందాల ను తిలకించెందుకు ఈనెల 22వ తేదీ ఆదివారం పద్నా లుగు మంది బృందం మారేడుమిల్లి పర్యటన కు వచ్చారు. వీరు పచ్చిమగోదావరి జిల్లా ఏలూరు ఆశ్రమం వైద్య కళాశాల లో ద్వితీయ సంవత్సరం ఎం. బి. బి. ఎస్. చదువు తున్నారు.
జలతారాంగిని జలపాతం వద్ద అకాల వర్షం కారణం గా ఐదు గురు వ్యక్తులు గల్లాంతయారు. వీరిలో గాయత్రిపుష్ప, హరిణి ప్రియా, గాయలతో బయటపడగా, సౌమ్య, అమృత మృతదేహాలు సోమవారం ఉదయం దొరికాయి, ప్రకాశం జిల్లా మార్కాపురం కు చెందిన చింటాకుట్ల. హరి దీప్ ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి రవి ప్రసన్న, తల్లి కడసారి చూపు కోసం ఎదురు తెన్నులు చూస్తున్నారు.

## శిశువుల జననం కోసం గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి





### -మంత్రి సుభాష్

**కాజులూరు,పెన్‌పవర్,సెప్టెంబర్26:**ఆరోగ్యవంతమైన శిశువుల కోసం గర్భిణీ స్త్రీలు ప్రతి రోజు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు.గురువారం రామచంద్రపురం పట్టణం లైన్స్ క్లబ్ కళ్యాణమండపంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా రామచంద్రపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యూట్రిషన్ స్టాల్స్ లో ప్రదర్శనకు ఉంచిన పౌష్టికాహార పదార్థాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణీ స్త్రీలు ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు బాలింతలలో రక్తహీనతను నివారించే పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడమే పౌష్టికాహార మాసోత్సవాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.గర్భిణీ బాలింతలలో రక్తహీనతను నివారించడానికి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. బాల సంజీవని స్కీం ద్వారా అనుబంధ పోషకాహారం అందిస్తున్నామని గర్భిణీలు బాలింతలకు బాల సంజీవని పోషకాహార కిట్టును ఇవ్వడం జరుగుతుందన్నారు. కోడిగుడ్లు పాలు బియ్యం నూనె పప్పు వంటివి ప్రతినెలా అందిస్తున్నామన్నారు. చిన్నపిల్లల్లో పోషకాహార లోపాల వల్ల అనారోగ్యాల బారిన పడకుండా బాలామృతం ఫుడ్ బ్యాగ్ తో పాటుగా కోడిగుడ్లు పాలు ప్రతినెల అందిస్తున్నామని తెలిపారు. బాలామృతంతో ఎలాంటి ఆహార పదార్థాలు తయారు చేసుకోవాలో తెలియక వృధా అవుతున్న నేపథ్యంలో బలామృతంతో వివిధ రకాల రుచికరమైన ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించడానికి ఆహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శనలు ఉంచామన్నారు. గర్భిణీలు బాలింతలుగా ఉన్నప్పుడు వారు తీసుకునే ఆహారం మీదనే తమ పిల్లల ఆరోగ్య భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు.సరైన పౌష్టికాహారం తీసుకోకపోతే పిల్లలకు పోషకాలు అందక అనారోగ్యాల బారిన పడతారని.. అనారోగ్యంతో జన్మించిన శిశువుల తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతమన్నారు.ఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణీలు ప్రతిరోజు కొంచెం సేపు నడవాలని తెలిపారు. చిన్నపాటి వ్యాయామాలు రోజు చేయాలన్నారు. అనంతరం మంత్రి అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు.కార్యక్రమంలో రామచంద్రపురం సిడిపిఓ వరాహలక్ష్మి, అంగన్వాడి యూనియన్ లీడర్ దుర్గ అంగన్వాడీ టీచర్లు కార్యకర్తలు , ప్రజా ప్రతినిధులు గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు చేకూర్చే ఉపాధి అవకాశాలను పరిశీలించాలి: కలెక్టర్



**పోడూరు, పెన్ పవర్, సెప్టెంబర్ -26:** తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనాలు ఎటు వచ్చే ఉపాధి అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగరాణి జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగుదలకు కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్మెంట్ అండ్ వాటర్, న్యూఢిల్లీ (సిఇఇడబ్ల్యూ) ప్రతినిధులు, డి ఆర్ డి ఎ, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాలలో సాంకేతికత, సౌర విద్యుత్ జోడించి ఆయా రంగాలలో ఉపాధి పొందుతున్న లబ్ధిదారులకు తక్కువ ఖర్చుతో, ఎక్కువ లాభాన్ని చేకూర్చే ఉపాధి అవకాశాలను జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలన్నారు. వరి సాగు, డైరీ, డ్రై ఫిష్ , కోకోవా వంటి వాటికి సాంకేతికతను, సౌర విద్యుత్ పరికరాలతో చేపట్టడానికి ప్రయోగాత్మకంగా పరిశోధనలను చేపట్టాలన్నారు. పాడి రైతు పశు వులకు దాణ, తౌడు, ఉలవలు వినియోగం ఖర్చును తగ్గించేందుకు, మొక్కజొన్న గింజలు ద్వారా సగటున ఐదు, ఆరు రోజుల్లో పశు గ్రాసాన్ని పెంచుకునే విధానాన్ని సిఇఇడబ్ల్యూ పరిచయం చేస్తుందన్నారు. దీని ద్వారా పశువులకు అందించే దాణ ఖర్చు కొంత తగ్గడంతో పాటు పశువులు ఎక్కువ వెన్న శాతంతో కూడిన పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. తడిధాన్యాన్ని ఆరబెట్టుటకు డ్రయర్స్, మత్స్య ఉత్పత్తులకు సోలార్ రిఫ్రిజిరేటర్స్, కోల్డ్ రూమ్, కోకోవా రైతులకు సోలార్ పాలీ హౌస్ డ్రయర్స్ తదితరాలను సబ్సిడీపై అందించడానికి లబ్ధిదారులను గుర్తించి ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలన్నారు.తొలుత సిఇఇడబ్ల్యూ ప్రతినిధులు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సాంకేతికత, సౌర విద్యుత్ వినియోగించే అవకాశాలపై వివరించారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, ఉద్యానవన శాఖ అధికారి ఆర్.దేవానంద్ కుమార్, మత్స్య శాఖ అధికారి ఆర్ వి ఎస్ ప్రసాద్, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి ఏ.నాగేంద్రప్రసాద్, న్యూఢిల్లీ సిఇఇడబ్ల్యూ సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రీతం యశస్వి, సైంటిస్ట్ మనీష్ పాల్గొన్నారు.

## వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**లివర్ వాపుతో బాధపడంతో పాటుగా కిడ్నీ పాడయ్యి వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న పైడిమెట్ట గ్రామ వాసి కొప్పాక నానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున 6 వేల రూపాయలు, సంస్థ జిల్లా కన్వీనర్ వాసిబోయిన చంద్రయ్య 500 రూపాయలు, మాజీ ట్రెజరర్ చెరుకు ఆంజనేయులు 500 రూపాయలు కలిపి మొత్తంగా సంస్థ ఆధ్వర్యంలో మెడిసిన్, వైద్య ఖర్చులకు 7 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేయడమైనదని సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ కుమార్ తెలిపారు. కష్టాలు, బాధల్లో ఉన్నవారికి సాయం అందించడమే సంస్థ ధ్యేయమని, విద్య, వైద్య ఖర్చులకు సంస్థ అధిక మొత్తంలో ఖర్చు చేస్తుందని తెలిపారు. సంస్థ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బారనాల శంకర్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారి ఒక్క కన్నీటి బొట్టునైనా తుడవడమే సంస్థ ధ్యేయమని, ప్రస్తుత సమయం సంస్థకు సభ్యత్వాల నమోదు సమయమని మానవతావాదులందరూ స్పందించి రూ.600 చెల్లించి సంస్థ కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సనపల రాజశేఖర్, సాయన సుబ్బారావు, గోళ్ల అనిల్, కొప్పాక రాజు, కొప్పాక సుబ్బారావు, అయినపర్తి రాజు, కొప్పాక విక్టర్, అయినపర్తి అనిల్ కుమార్, కొప్పాక నాగేశ్వరరావు, గంపల రమణ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గం రూపు,రేఖలు మారుస్తాం: ఎమ్మెల్యే



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** తాడేపల్లిగూడెం నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామని ఎంఎల్ఏ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రామన్నగూడెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నియోజవర్గ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామని రాబోయే రోజుల్లో అభివృద్ధి పరుగులు పెట్టేస్తామని చెప్పారు.

పాలన చేతకాని మాఫియాడాన్ చేతిలో ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని అప్పగించి రాష్ట్ర మూలాలు దెబ్బ తినే విధంగా రాష్ట్రం నిర్వీర్యం చేశారన్నారు. నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లిన గోతుల రోడ్లు దర్శనమిస్తున్నాయని, పారిశుధ్యం అతలా కుతలమై ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని అన్నారు.

వైసీపీ అవినీతి పాలనలో భాగస్వామ్యులైన మంత్రులు సిగ్గు లేకుండా ప్రజలోకి వచ్చి మాట్లాడడం దౌర్భాగ్యం అన్నారు.టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు, గ్రామాల్లో రోడ్లు నిర్మించి అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తారని స్పష్టం చేశారు. ముందుగా గ్రామంలో 65 లక్షల రూపాయలతో నిర్మించనున్న రోడ్ల పనులకు భూమి పూజ నిర్వహించి, గ్రామంలోని జలజీవన్ పథకం ద్వారా 20 లక్షలతో పైపులైన్లను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు శీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, సర్పంచ్ చింతా వెంకట్రావు, గ్రామ టిడిపి జనసేన అధ్యక్షులు రవితేజ, నాగరాజు, ఎంపీడీవో విశ్వనాథ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రాజా శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మండలంలో కార్యదర్శుల బదిలీల పర్వం

**కాజులూరు,పెన్‌పవర్,సెప్టెంబర్26:** మండలపరిధిలో గ్రామ పంచా యతీ కార్యదర్శుల బదిలీల పర్వం కొనసాగనుంది. అలాగే మరికొంతమంది గ్రేడ్-3 కార్యదర్శులకు గ్రేట్ ప్రమోషన్ రావడంతో ప్రభుత్వం తప్పని సరి బదిలీలు జరగాల్సిందే అని ఆదేశాల జారీ కావడంతో బదిలీల పర్వం జోరందుకుంది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు వారం రోజుల్లో పంచాయతీ కార్యదర్శులు,జూనియర్ అసిస్టెంట్లు తప్పని సరిగా బదిలీ కావాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో బదిలీలు జరగనున్నాయి.

కాజులూరు మండలంలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా సేవలందించిన జి.వి.శేఖర్ రెడ్డి కాజులూరు నుండి సామర్లకోట మండలం వికెరాయపురం,గొల్లపాలెం కార్య దర్శి సీహెచ్ వేణుగోపాలరావు యు.కొత్తపల్లి మండలం కొమరిగిరి, దుగ్గుదూరు కార్యదర్శి జి.ఉషారాణి పెదపూడి,కె.వి.రవిప్రసాద్ గండేపల్లి (మం) సూరంపాలెం నుండి గొల్లపాలెం పంచాయతీకి, జగన్నాధగిరి పంచాయతీ కార్యదర్శి కర్రి ఈశ్వరి కాజులూరు పంచాయతి కార్యదర్శిగా బదిలీ కానున్నారు.అలాగే ఆర్యవటం కార్యదర్శి జగ్గంపేట (మం)మర్రిపాక,కోలంక కార్యదర్శి ఎం.శ్రీనివాస్ జగన్నాధగిరి,శీల కార్యదర్శి కె.సూరిబాబు ఆర్యవటం, శలపాక కార్యదర్శి కె.అనంతలక్ష్మి దుగ్గుదుర్రు,సంపర నుండి జూనియర్ అసిస్టెంట్ ఎన్.వి.లక్ష్మి మంగ బందనపూడి,బదిలీ కానున్నారు. అలాగే పల్లిపాలెం కార్యదర్శి బత్తిన హేమావతి శీల గ్రామ పంచాయతీకి, తాళ్లరేవు మండలనుండి కాజులూరు మండలంలోని కుయ్యేరు పంచాయతీకి జి.రాజ్‌కుమార్, ఎం.ఎస్. ఎస్.ఎస్.రావు మంజేరు గ్రామ పంచాయతీకి బదికానున్నారు. వీరితోపాటు కాజులూరు ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ చరణ్ బదిలీపై యు.కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెల్లనున్నారు.

వీరందరికీ 24వ తేదీనే బదిలీ ఆర్డర్లు జారీ అయ్యాయి.అయితే ఈ నెలాఖరున సామాజిక పింఛన్ల పంపిణీ అనంతరం అక్టోబరు 3వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సీనియర్ కార్యదర్శులు పెన్ పవర్ ప్రతినిధికి వివరించారు.

# అర్బన్ లో పేదరిక నిర్మూలన మెప్మా లక్ష్యంగా పనిచేస్తుంది.





**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** అర్బన్ లో పేదరికల నిర్మూలన మెప్మా లక్ష్యంగా పనిచేస్తుందని నగర పంచాయతీ కౌన్సిలర్ అలమండ చలమయ్య అన్నారు. స్థానిక ఆంధ్ర బ్యాంక్ సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ స్టాల్ ను గురువారం ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు, మెప్మా సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్ ను కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చలమయ్య, బొదిరెడ్డి గోపి లు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఉపయోగించుకునే వస్తువులు అందుబాటులోకి తేవాలన్నారు. నైపుణ్య అభివృద్ధి ద్వారా పోటీ ప్రపంచంలో మంచి ఉత్పత్తులను ప్రజలకు అందిస్తే బాగుంటుందన్నారు. ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని డ్వాక్రా మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.మహిళా సాధికారత మారుతున్న ఆధునిక సమాజంలో కుటుంబ సమాజాభివృద్ధికి ఎంతో అవసరం అని అన్నారు. కుటుంబ ఉన్నతికి పురుషులతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. అర్బన్ ప్రాంతాల్లో మహిళా సంఘాలు ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని కుటీర పరిశ్రమలు ప్రారంభించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కాకాడ నాగేశ్వరరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో-చైర్మన్ జొన్నాడ వీరబాబు, కౌన్సిలర్లు ఎండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, మామిడి శ్రీను, మెప్మా టిఎంసి సాయికుమార్, సి ఓ లు, ఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు.

# మందు గుండు సామాగ్రి కలిగి ఉన్న వ్యక్తులపై కేసు నమోదు

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 26** దీపావళి సంబరాలు త్వరలో రావడంతో ప్రభుత్వం ద్వారా అనుమతులు తీసుకోకుండా మందు గుండు సామగ్రి ని తయారు చేయడం విక్రయించడం నేరమని. అటువంటి వారిపై కఠిన చర్యలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలతో కొత్తపేట ఇంచార్జ్ డిఎస్పి గోవిందరావు పర్యవేక్షణలో ఆత్రేయపురం మండలంలో అనుమతులు లేకుండా ముందు సామాగ్రి కలిగి ఉన్న వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేశారు. నార్కెడిమిల్లి గ్రామ శివారు మకాము లో తయారుచేసిన 200 తారాజువ్వలు ఐదు కేజీల బొగ్గు పౌడర్ సీజ్ చేసి, కేసు నమోదుచేశారు. తాడిపూడి గ్రామ శివారు లో తయారుచేసిన 250 తారాజువ్వలును స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్రేయపురం ఎస్ఐ శ్రీ ఎస్. రాము తెలిపినారు.






## కార్గో సేవలు వినియోగించుకోవాలి : సుబ్బారావు




**పెనుమంత్ర, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** మండలంలోని మార్టేరు కోడేరు రోడ్ ఆర్కె కాంప్లెక్స్ నందు ఇటీవల ప్రారంభించిన ఏపీఎస్ఆర్టీసీ కార్గో పార్సెల్ సర్వీస్ బస్సు రిజర్వేషన్ కౌంటర్ ను గురువారం పశ్చిమ గోదావరి జిల్లా కార్గో ఏటీఎం సుబ్బారావు సాధారణ తనిఖీ లలో భాగంగా ఉమ్మడి కార్గో కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. వినియోగదారుల తో సత్సంబంధాలను ఎలా కలిగి ఉండాలి? కార్గో సేవలను విస్తృతంగా పెంచడానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలి? అనే వాటి పై చర్చించారు. మార్టేరు గ్రామం నాలుగు మండలాలకు జంక్షన్లో ఉండడం వలన నాలుగు మండలాల ప్రజలు ఏపీఎస్ఆర్టీసీ కార్గో పార్సెల్ సర్వీస్ ను బస్సు రిజర్వేషన్ సర్వీసును వినియోగించి కావాలని కోరారు, అతి తక్కువ ధరలకే తక్కువ సమయంలో విలువైన వస్తువులను చేరవేయుటకు ఆర్టీసీ కార్గో సేవలు వినియోగించుకోవాలని అన్నారు. మార్టేరు కోడేరు రోడ్ లో గల ఎంఆర్ఎఫ్ షోరూమ్ వారిని కలిసి సరుకు రవాణా కోసం ఏపీఎస్ఆర్టీసీ కార్గో సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్గో ఏటీఎం సుబ్బారావు తో పాటు నరసాపురం కార్గో డి ఎం ఈ శివప్రసాద్,స్థానిక కార్గో ఏజెంట్ బాణాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వైసిపి జిల్లా అధ్యక్షులు ప్రసాదరాజును కలిసిన గూడెం నాయకులు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,సెప్టెంబర్ 26:** పశ్చిమగోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఇటీవల నూతనంగా నియమితులైన ప్రభుత్వ మాజీ విప్, నరసాపురం మాజీ శాసనసభ్యులు ముదునూరు ప్రసాద రాజును గురువారం తాడేపల్లిగూడెం నాయకులు కలిశారు. నరసాపురంలో ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. ప్రసాదరాజు నాయకత్వంలో పశ్చిమగోదావరి జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరిగి పూర్వవైభవం సంతరించుకోవాలని వారంతా ఆకాంక్షించారు. ప్రసాద రాజు ను కలిసిన వారిలో ముప్పిడి సంపత్ కుమార్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, కైగాల శ్రీనివాస్, చెన్న జనార్ధన్, గుండుమోగుల సాంబయ్య, బండారు నాగు తదితరులు ఉన్నారు.

## వసతి గృహాలను సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు...





**దేవీపట్నం,పెన్ పవర్,సెప్టెంబర్26:** మండలంలోని పోతవరం,దామనపల్లి,శరభవరం ,ఆశ్రమ పాఠశాలలను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహాల్లో విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని,ప్రధానోపాధ్యాయులకు,వార్డెన్లను ఆదేశించారు.విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.విద్యార్థులతో ముచ్చటించి వారితో కలిసి భోజనం చేసి, విద్యార్థులకు నాణ్యత గల ఆహారం అందించాలని,మెనూ తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓ రామతులసి,ప్రధానోపాధ్యాయులు బి.చంద్రకళ,సి.హెచ్ నూకాలమ్మ,తదితరులు పాల్గొన్నారు

## జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడుని పరామర్శించిన నాయకులు



**చాగల్లు, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** మండలంలోని జనసేన పార్టీ మార్కొండపాడు గ్రామ అధ్యక్షులు బోడెం సుబ్రమణ్య శర్మ ఇటీవల రోడ్ యాక్సిడెంట్ కి గురై గాయాలపాలయ్యారు. గురువారం జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గాయత్రి వెంకటేశ్వరరావు, కొవ్వూరు నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షులు, మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర ముని ప్రసాద్, జనసేన పార్టీ తాళ్లపూడి మండల అధ్యక్షులు గంటా కృష్ణ, చాగల్లు మండల అధ్యక్షులు ఉప్పులూరి చిరంజీవి, మార్కొండపాడు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు సుబ్రహ్మణ్య శర్మను పరామర్శించారు.

## కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణిని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం భీమవరం లో కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ప్రధానంగా ఎర్ర కాలువ వరదలకు ప్రతి ఏడాది వేలాది ఎకరాలు వరి పంట ముంపునకు గురవుతుందని తెలిపారు. దీనికి శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని కోరారు.

## ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏర్పాటు



**కూనవరం,పెన్ పవర్, సెప్టెంబర్ 26.** కూనవరం మండలం శబరి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ 17 మంది పాత్రికేయులతో గురువారం ఏర్పాటయింది.మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా షేక్ అహ్మద్ బాషా ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షునిగా గడ్డం వెంకటేశ్వరరావు,బి బద్రి, కార్యదర్శిగా ఎస్.కె రసూల్, సహాయ కార్యదర్శులుగా ఎలిపే రమేష్,వేముల సతీష్, కోశాధికారిగా ముత్యాల శ్రీను, సభ్యులుగా నెల్లూరి రమేష్, బుగ్గ ప్రసాద్,ఎం వివి రాజు, సిహెచ్ బాలు, ముప్పెనబోయిన నాగరాజు, కే రాజు,కొండయ్య,జి శ్రీనివాస్ లు,గౌరవ సలహాదారులుగా సీనియర్ రిపోర్టర్లు దీకొండ వెంకటరమణ,కోట బాబురావు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

# గజ్జరం, మలకపల్లి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి





**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం తాళ్లపూడి మండలంలోని గజ్జరం, మలకపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన "ఇది మంచి ప్రభుత్వం" సభలో పాల్గొన్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే విధంగా కూటమి ప్రభుత్వ పరిపాలన సాగుతోందని పేర్కొన్నారు. పేదవాడు 5 రూపాయలకే కడుపునిండా భోజనం పెట్టాలని కూటమి ప్రభుత్వం రాగానే పేదలను దృష్టిలో పెట్టుకుని చెప్పిన మాట ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్నక్యాంటీన్లను రీఓపెన్ చేయడం జరిగిందని అన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ కూడా రద్దు చేయడం జరిగిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అధికారం చేపట్టిన తొలి 100 రోజుల్లోనే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కొవ్వూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా కృషి చేయడం జరుగుతుంది అన్నారు. గజ్జరం గ్రామంలో నిర్వహించిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో గ్రామంలోని పలువురు గర్భిణీ మహిళలకు ఏర్పాటు చేసిన సామూహిక శ్రీమంతం వేడుకలకు హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించడమైనది. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కిర్లంపూడిలో తుమ్మలపల్లి రమేష్ దీక్ష

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 26 :** తిరుపతి లడ్డూ ప్రసాదంలో జరిగిన అపవిత్రం కారణంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కిర్లంపూడిలో గల చిల్లంగి శ్రీ భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ గురువారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు దీక్ష చేపట్టారు. 108 కొబ్బరికాయలు కొట్టి, లలితా పారాయణం, వెంకటేశ్వర స్వామి అష్టోత్తరం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం తుమ్మలపల్లి రమేష్ కు వెంకటేశ్వర స్వామి భక్తులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ హిందువులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డు ప్రసాదం అపవిత్రం చేసి గత జగన్ ప్రభుత్వం హిందూ మనోభావాలను ఎంతగానో దెబ్బతీసిందని విమర్శించారు. వైయస్సార్ పార్టీ హిందూ వ్యతిరేక పార్టీ అని ఎద్దేవా చేశారు. లడ్డు అపవిత్రం చేసిన అప్పటి వైసిపి ప్రభుత్వం పై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుమల వెంకటేశ్వర స్వామి నాటి పాలకులు చేసిన తప్పిదాన్ని మన్నించి ప్రజలందరినీ సుఖశాంతులతో కరుణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉలిసి ఐరాజు, మాదారపు వీరబాబు, గంధం ప్రభాకర్, ఎల్లపు దొరబాబు, కాకిలేటి బాబ్జి, బోండా రమణ, బోండా, నందిబాబు, చిక్కాల కల్కి భగవాన్, లంక సత్యనారాయణ, నాగబోయిన శివ, కొట్టేది గణేష్, వడ్డాది వీరబాబు, జో



నకుటిలోవ, ఎలుబండి శివ, డేగల విజయ్, కాయల మణికంత, పాలెం బాబీ, మేడిబోయిన శ్రీను, సూరంపాలెం బాలు, కుంచే కోటి, దొడ్డా శ్రీను, మొగిలి గంగాధర్, రామిశెట్టి రాజు, పాఠం శెట్టి రమేష్, ఓం, జనసేన టిడిపి బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# మంచి ప్రభుత్వంగా ప్రజలు మన్ననలు పొందిన మీ ప్రభుత్వం

## - ఆచంట ఎమ్మెల్యే పితాని

**పెనుమంట్ర, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**100 రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వంగా ప్రజల మనలను పొందిందని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం ఉదయం ఆచంట మండలం పెనుమంచిలి లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ వంద రోజుల పాలనలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి భూ యజమానికి భూమిపై హక్కు కల్పించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు, డ్వాక్రా మహిళలకు ఐదు లక్షల నుండి 10 లక్షల వరకు రుణాన్ని పెంచి ఇచ్చిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం కాదా అంటూ డ్వాక్రా మహిళలను అడిగారు. ఐదేళ్లలో ఒకటో తారీఖున ఉద్యోగులకు జీతాలు ఇచ్చిన పరిస్థితి లేదని కూటమి ప్రభుత్వం రాగానే ఒకటో తారీఖున ఉద్యోగుల జీతాలు చెల్లించిన ఘనత చంద్రబాబు పవన్ కళ్యాణ్ కి దక్కుతున్నాను. రాజధాని అమరావతి అని జగన్మోహన్ రెడ్డి మూడుముక్కలాటాడేరని విమర్శించారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కుటమి పాలన చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దీపావళికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తామని చెప్పారు. తొలిత గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం శిబిరాన్ని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తిలకించారు

ఈ కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, ఆచంట జడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, వైస్



ఎంపీపీ తాళం శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ గణేశుల శేషవాణి, ఉపసర్పంచ్ జి వెంకటలక్ష్మి, ఎంపిటిసి వెంకటలక్ష్మి మోహన్, తహసిల్దార్ డి సంధ్య, ఎంపీడీవో నరసింహ ప్రసాద్,టిడిపి మండల అధ్యక్షులు కేత మీరయ్య, జనసేన మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ, బిజెపి మండల అధ్యక్షులు ఎం సుబ్బారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు పాలెం నాగేశ్వరరావు జనసేన గ్రామ అధ్యక్షులు చామన అంజిబాబు, బిజెపి గ్రామ అధ్యక్షుడు చామన శ్రీను, టిడిపి యువనాయకులు సిరా బాలాజీ,టిడిపి గ్రామ సెక్రెటరీ పంది సుబ్బారావు మంగిన రాము, అల్లం సూర్యప్రకాష్ మరియు బిజెపి జనసేన టిడిపి కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో వై రామవరం





**వై రామవరం,పెన్ పవర్, సెప్టెంబర్ 26 :**మండలంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యల వలయంలో చిక్కుకొని పోయిందని ప్రజా ప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో గళమెత్తారు.

వై రామవరం మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ కే ఆనందరావు అధ్యక్షతన జరిగింది. సర్పంచులను నామమాత్రంగా వాడుకుంటున్నారని, అభివృద్ధి కార్యక్రమాలలో సర్పంచులకు విలువ లేకుండా చేస్తున్నారని ఎంపీపీ ఈవో అండ్ పి ఆర్ డి ని ప్రశ్నించారు. పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణ పర్యవేక్షణ కొరవడిందని ఆరోపించారు. సోలార్ విద్యుత్ కనెక్షన్లు పూరి గుడిసెలు ఉన్న కొండ రెడ్ల కి మంజూరు ఎలా చేస్తారని ప్రశ్నించారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అడవి జంతువులకు అక్రమ విద్యుత్తుకంచెలు వినియోగించి మనుషుల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. ఇటీవల దేవరమడుగుల, పి ఎర్రగొండ,బుల్లోజుపాలెం గ్రామాలలోముగ్గురు మరణించారని, సంబంధం ఉన్న వ్యక్తులపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారని ఎంపీపీ, విద్యుత్ శాఖ ఏఇ ని ప్రశ్నించారు.

వై.రామవరం నుండి గుర్తేడు వరకు నిలిచిపోయిన రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తి అవుతుందని సభ్యులు ప్రశ్నించగా ఐటీడీఏ నుండి రెండు కోట్ల రూపాయలు చెల్లించిన వెంటనే పనులు మొదలవుతాయని డిఆర్ఓ తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం రహదారులు నిర్మిస్తుంటే అటవీ శాఖ అభ్యంతరములు ఏమిటని సభ్యులు ధ్వజమెత్తారు. సమావేశంలో విద్య,వైద్యం, వ్యవసాయం,ఉపాధి హామీ,పశువుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాపన్న దొర, జడ్పిటిసి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు విశ్వమ్మ,జోగి రెడ్డి, ఎంపీటీసీ కరక వెంకటరమణ, తహసిల్దార్ అనసూయ, ఎంఈఓ తాతబ్బాయి దొర, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# దేవర సినిమా రిలీజ్ థియేటర్ వద్ద జూ.ఎన్టీఆర్ అభిమానుల సందడే సందడి.




**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** పాన్ ఇండియా మూవీ దేవర రిలీజ్ సందర్భంగా స్థానిక జయ శ్రీ థియేటర్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు గురువారం చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ఉదయం నుంచి థియేటర్ వద్ద భారీ ఫ్లెక్సలను ఏర్పాటు చేసిన అభిమానులు 27న రిలీజ్ కానున్న దేవర సినిమాను 26 రాత్రి ఒంటిగంట కు ప్రత్యేకంగా ఫేవరెట్ షో వేస్తున్నామని ఎన్టీఆర్ అభిమానులు తెలిపారు. మిడ్ నైట్ షోకు టికెట్ ధర 400 రూపాయలుగా నిర్ణయించారు. ఇప్పటికే టికెట్లు అన్ని అమ్ముడుపోయాయని ఎన్టీఆర్ అభిమానులు తెలిపారు. అలాగే 27వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఐదు షోలు ప్రదర్శించబడతాయని టికెట్ ధర 250 రూపాయలుగా థియేటర్ యజమాన్యం ప్రకటించింది. థియేటర్ల వద్ద రిలీజ్ సినిమాలకు క్రౌడ్ ఎక్కువగా ఉంటున్న కారణంగా దేవర సినిమా రెగ్యులర్గా ప్రదర్శించబడే జయ శ్రీ థియేటర్ తో పాటు వెంకట సూర్య థియేటర్ లో ఒక్కరోజు మాత్రమే దేవర సినిమా ప్రదర్శించబడుతుందని తెలిపారు. అయితే జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల చేస్తున్న హడావిడి కి థియేటర్ వద్ద సందడి నెలకొంది.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పెనుమంట్ర, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**పెనుమంట్ర మండల పరిధిలో అన్ని గ్రామములకు ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పెనుగొండ 132 కేవి సబ్ స్టేషన్ మెయింటనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్.సురేష్ కుమార్ తెలిపారు. కానుక వినియోగదారులు సహకరించాలని కోరారు.

# జీలుగుమిల్లి మండల సమాఖ్య కార్యాలయంలో నిర్బంధ వసూళ్లు దందా




**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 26** జీలుగుమిల్లి మండల సమాఖ్య కార్యాలయంలో సిబ్బంది నిర్బంధ అక్రమ వసూళ్లు చేయడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్యాలయంలో ఏపీవో, నలుగురు సీసీలు బదిలీ అయ్యారు .అయితే వివో ఏలు అందరూ కలిసి బదిలీ అయిన వారికి ఘనంగా సన్మానం చెయ్యాలని నిర్ణయించుకున్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో ఘనంగా సన్మానించడం జరిగింది. మండలంలోని 37 మంది వివో ఏలు ఉన్నారు. ఒక్కొక్కరు 5000 రూపాయల చొప్పున ఇవ్వాలని సీనియర్ వివోఏ ఆదేశించింది. ఇవ్వలేని వారిని అవమానించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. జీతాలు లేక ఇంట్లో గడవక అనేక ఇబ్బందులకు గురి అవుతుంటే సీనియర్ వివోఏలు మానసికంగా వేధిస్తున్నారని సన్మానానికి డబ్బులు ఇవ్వనివారు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో ఎవరు బదిలీ అయినా గాని నిర్బంధ వసూళ్లు చేయటం సర్వసాధారణం అయిపోయిందని వాపోతున్నారు .ఏపీవో ఏ రామారావు ని వివరణ కోరగా వివో ఏలు సన్మానానికి డబ్బులు వసూలు చేయడం నాకు తెలియదు అని తెలిపారు.

# విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలి



**అమలాపురం రూరల్, పెన్ పవర్, సెప్టెంబర్,26** విద్యార్థులు అందరూ విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో అమలాపురం ఈదరపల్లి లో వున్న నారాయణ ఒలింపియాడ్ స్కూల్ లో కేబినెట్ ఎలక్షన్ సెర్మనీ వేడుకలు ప్రిన్సిపాల్ మహేష్ అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా నారాయణ స్కూల్స్ ఎజీయమ్ శ్రీనివాసరెడ్డి, మరియు క్లస్టర్ ప్రిన్సిపాల్ రామచంద్రం పాల్గొని క్యాబినెట్ ఎన్నికల ఫలితాలను వెల్లడించారు. తరువాత నూతనంగా ఎన్నికైన విద్యార్థినీ విద్యార్థులను బ్యాడ్జీలతో సత్కరించి అభినందించారు. ముఖ్య అతిదులుగా విచ్చేసిన శ్రీనివాసరెడ్డి మరియు రామచంద్రంలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు అలవరచుకొని మెరుగైన సమాజం కోసం మన వంతు ప్రయత్నం చేయాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంతో ఆర్ఎస్టి రాధాకృష్ణ, స్కూల్ డీన్ సత్యనారాయణ, స్కూల్ ఎఒ రాజకడూ మరియు టీచింగ్ %ట% నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం





## ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు

**కాకినాడ.పెన్ పవర్ సెప్టెంబర్ 26 :**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల అవసరాలను తీర్చేందుకు అటు ప్రజాప్రతినిధులుగా తాము, ఇటు అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక 30, 35, 36, 37, 38, 39, 40 డివిజన్లకు సంబంధించి 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజా వేదిక కార్యక్రమం గురువారం సాయంత్రం కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వెనుక గల విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ మనోహర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వనమాడి మాట్లాడుతూ.. తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోనూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికే ప్రాధాన్యమిస్తోందన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం పాలన చేపట్టిన వందరోజుల్లోనే.. అర్హులందరికీ పింఛన్ల సొమ్ము పెంచి అందజేసిందన్నారు. అలాగే రైతులకు రుణ సాయం, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ప్రకటించారన్నారు. అలాగే త్వరలో దీపావళికి గ్యాస్ సిలిండర్, సంక్రాంతికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందించనున్నామన్నారు. అధికారులు, ప్రజల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడం కోసమే వారందరినీ ప్రజావేదిక కార్యక్రమానికి రప్పిస్తున్నామని, వారందరి ఫోన్ నంబర్లు తీసుకుని సమస్యలేమైనా ఉంటే నేరుగా ఫోన్ చేయవచ్చని ప్రజలకు సూచించారు. అధికారులను ప్రజలకు పరిచయం చేశారు. అలాగే కాకినాడ నగరంలో ఉన్న అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, కాకినాడ నగరాన్ని స్వచ్ఛ నగరంగాను, గంజాయి రహిత నగరంగాను తయారు చేస్తామన్నారు. ఇప్పటికే కాకినాడలో గంజాయి తగ్గుముఖం పట్టిందన్నారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వం స్థలాల పేరుతో ప్రజలను నిలువునా ముంచిందన్నారు. ఎక్కడో నగరానికి దూరంగా కొమరగిరిలో లే అవుట్లు వేసి ప్రజలకు నరకం చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ మనోహర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మెషీన్ మేనేజర్ డి.వెంకట్రాజు, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు, సచివాలయాల సిబ్బంది, యానిమేటర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# మిల్లర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## ఎంపీ ఉదయ్, ఎమ్మెల్యే రాజప్ప

**కాకినాడ.పెన్ పవర్ సెప్టెంబర్ 26 :** రాష్ట్రంలో సంక్షోభంలో ఉన్న రైస్ మిల్లర్లను ఆదుకొని వారి సంక్షేమానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. గురువారం కాకినాడలోని జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ హాలులో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన వల్లూరి సూర్యప్రకాశరావు (సూరిబాబు)కు అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఉదయ్, చిన రాజప్పలు మాట్లాడుతూ తమ కూటమి మిల్లర్లకు నిరంతరం సహాయం పడుతుందన్నారు. గతంలో చిన్న రైస్ మిల్లు చాలా ఇబ్బందులు పడ్డాయని అది తమకు తెలియడంతో ఈసారి చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరికీ సమానంగా ధాన్యం అందిస్తామని చెప్పారు. రైస్ మిల్లర్లు గడిచిన నాలుగేళ్లలో చాలా సంక్షోభం ఎదుర్కొన్నాయని ఈసారి కూటమి ప్రభుత్వంలో ఆ సమస్యకు ముగింపు పలుకుతుందన్నారు. అన్ని వర్గాలకు చెందిన ప్రజలు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఉదయ్, రాజప్పలు చెప్పారు. అనంతరం రైస్ మిల్లర్లు వారు ఎదుర్కొంటున్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎన్నికైన సూరిబాబును రైస్ మిల్లర్లు, అతని అభిమానులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నున్న రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, రాష్ట్ర మిల్లర్ అసోసియేషన్ ట్రెజరర్ నాయుడు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి మిల్లర్లుహాజరయ్యారు.




# భువనేశ్వరి పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

## ఈనెల 28న రాట ముహూర్తానికి సన్నాహాలు

పెద్దాపురం, పెన్ పవర్, సెప్టెంబర్ 26 : పట్టణ పరిధిలోని స్థానిక వర్జుల వారి వీధిలో కొలువైన భువనేశ్వరి పీఠంలో పీఠాధిపతి చింతా గోపీశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల మూడవ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 28వ తేదీన రాట మూహూర్తం చేయనున్నామన్నారు. ఉదయం 9.23 నిమిషాలకు వేముల సత్యసాయి ప్రసాద్, అరుణ దంపతులచే రాట ముహూర్తం ఉంటుందన్నారు. గత 25 ఏళ్లుగా భువనేశ్వరి పీఠంలో దేవి నవరాత్రులు నిర్వహించడం జరుగుతుందన్నారు. నవరాత్రుల్లో అమ్మవారికి ప్రతీ రోజూ అభిషేక, సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, హెూమం నిర్వహించడం జరుగుతుందన్నారు ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో అమ్మవారికి పూజలుంటాయని, పూజల్లో పాల్గొనే భక్తులు 9866193557, 889755557 నెంబర్లకు సంప్రదించాలని గోపీశర్మ సిద్ధాంతి కోరారు. దేవీమాల ధరించాలనుకునే భక్తులు ముందుగా సంప్రందించాలని ఆయన కోరారు.



# జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు..

**దేవీపట్నం,పెన్ పవర్,సెప్టెంబర్26:**మండలంలో గత కొంతకాలంగా జరుగుతున్న అక్రమ వ్యాపారుల దందాలపై స్పందించిన, రెవెన్యూ,పోలీస్,అటవీ,మూడు శాఖల అధికారులు.అధికారులపై అవాస్తవాలు వెదజల్లుతున్న కొంతమంది పత్రిక విలేకరులు వారి తీరు మార్చుకోమని సున్నితంగా చెప్పడం జరిగింది.ఇందుకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దుర్గా కుమార్ మాట్లాడుతూ....సంబంధిత శాఖలపై వచ్చే నిరాధార వార్తలపై సంబంధిత అధికారిని వివరణ అడిగి తెలుసుకుని రాయాలని నిరాధారణ వార్తలను పబ్లిక్ చేయడం స్వభావ కాదని, వాట్సాప్ గ్రూపులో డిబేట్లు పెట్టరాదని ప్రభుత్వ అధికారుల విధులకు భంగం కలిగించేలా వ్యవహరించవద్దని తెలియజేశారు.అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దేవీపట్నం తాసిల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ...అక్రమ కలప,అక్రమ రేషన్ బియ్యం,అక్రమ మట్టి త్రవ్వకాలు,మండలంలో ఎక్కడైనా చేసినట్లయితే వారి పైన తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

పోలీస్ శాఖ రెవెన్యూ శాఖ అటవీ శాఖ మూడు టీములుగా కలిసి అక్టోబర్ 1వ తేదీ నుండి జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి రాత్రి పగలు పెట్రోలింగ్ వేగవంత చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ప్రజలకు కష్టం వస్తే మధ్యవర్తుల్ని గాని బ్రోకర్లు గాని సంప్రదించకుండా నేరుగా తమ వద్దకు రావాలని తెలియజేశారు.దేవీపట్నం ఎస్సై షరీఫ్ మాట్లాడుతూ....

స్థానికంగా ఉన్న సమస్యలపై తప్పకుండా స్పందిస్తామని ఏ విషయమైనా మధ్యవర్తులతో కాకుండా నేరుగా ప్రజలు అధికారుల దగ్గరికి వచ్చి సమస్యలను చెప్పి పరిష్కరించాలని అన్నారు.మండలంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై ఎవరైనా సమాచారం ఇచ్చినట్లయితే వారి పేరు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,రెవెన్యూ సిబ్బంది,అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని కలిసిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జనసేన నాయకులు



**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 26** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని అమరావతిలో గురువారం పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు కలిశారు .పోలవరం ప్రాజెక్టు కు మరియు నియోజకవర్గంలోని రహదారులు అభివృద్ధికి 100 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలని చంద్రబాబుని కోరినట్లు బాలరాజు తెలిపారు. పోలవరం ఏజెన్సీ లో ఇసుకను సమీప గ్రామాల నుండి తీసుకు వెళ్లేందుకు సామాన్యులకు వెసులుబాటు కల్పించాలని చంద్రబాబుని కోరినట్లు ఉభయ పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్ తెలిపారు. అదేవిధంగా ఎక్సైజ్ ,గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రాని కూడా కలిసి నట్లు వారు తెలిపారు .ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సీనియర్ నాయకులు కరాటం రాంబాబు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి ఉన్నారు

## సానిటరీ వర్కర్స్ కు వ్యాక్సినేషన్, హెల్త్ చెకప్ క్యాంపులు



**కాకినాడ.పెన్ పవర్ సెప్టెంబర్ 26 :**స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల్లో భాగంగా కాకినాడ నగరంలోని 8, 9, 12 సర్కిల్ పరిధిలో పనిచేసే సానిటరీ వర్కర్స్ కు వ్యాక్సినేషన్, హెల్త్ చెకప్ క్యాంపులు నిర్వహించారు.అలాగే కాకినాడ నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల తదితర కాలేజీల్లో సైబర్ స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించారు దీనిలో భాగంగా మొబైల్ ఫోన్లలో అన్ వాంటెడ్ యాప్స్ లను తొలగింప చేయించారు. అలాగే పలు సచివాలయాల్లో ఇతర కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రత క్లీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్ వైజర్లు ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ , మంచి ఆరోగ్యానికి దారి-డా అడ్డాల



**కాకినాడ.పెన్ పవర్ సెప్టెంబర్ 26 :**స్థానిక రమణయ్యపేట లో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యాన డా నాగేంద్ర క్రీడాకారులకు, ప్రజలకి మొక్కలు పంపిణీ చేసారు.రాష్ట్ర ఐడిఎ కన్వీనర్ డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ"ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 26 న పర్యావరణ ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటారని, పర్యావరణం మరియు మానవ ఆరోగ్యం మధ్య పరస్పర సంబంధం గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. నీరు మరియు వాయు కాలుష్యం, ఆహార భద్రత మరియు వ్యర్థాల నిర్వహణ వంటి సమస్యలను పరిష్కరించడం ,ప్రజారోగ్యానికి ఎలా ముఖ్యమో కూడా ఈ రోజు గుర్తు చేస్తుంది అని తెలిపారు. మనమందరం పర్యావరణ పరిరక్షణ కోసంకలిసి పని చేయడం ద్వారా, మనం ప్రపంచాన్ని మార్చగలము మరియు రాబోయే తరాలను మంచి ఆకృతిలో ఉంచగలమని అన్నారు.ఈ కార్యక్రమం లో కాకినాడ ఐడిఎ సభ్యులు డా చైతన్య, డా కిరణ్, డా కిషన్, డా శ్రీనివాస్, డా శ్రీకాంత్, క్రీడాకారులు ప్రజలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత - జయ రామారావు



**గోపాలపురం, పెన్ పవర్, సెప్టెంబర్ 26.** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి ప్రధాన బాధ్యతని మండలంలోని వెంకటాయపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోనా జయ రామారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం ను పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో గురువారంమొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్ఎం జయరామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెట్లను పెంచాలన్నారు. చెట్లు ప్రగతికి మెట్లని పచ్చని చెట్లు ద్వారా వచ్చే గాలి ఎంతో స్వచ్ఛమైనదై ఉండి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. పర్యావరణం కలుషితం కాకుండా ఉండాలంటే చెట్లు తుంచకుండా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి కొయ్య నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు సేంద్రీయ వ్యవసాయంపై ఆసక్తి కనబరచాలి ఏవో రాజారావు




**గోపాలపురం, పెన్ పవర్, సెప్టెంబర్ 26.** రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి రాజారావు అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం మండలంలోని చిట్యాల వాదాలకుంట గ్రామాలలో గురువారం నిర్వహించారు ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పంటలపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. ఆరుతడి పంటలు అన్ని రకాల శ్రేయస్కరం అన్నారు. రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ప్రతి మంగళ బుధవారాలలో రోజుకు రెండు గ్రామాల్లో ఉన్న రైతుల పొలాలను సందర్శించి అక్కడ సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను తెలియజేస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉద్యానవన శాఖ అధికారి రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు నూతనంగా పండించే ఏ ఉద్యానవనం పంటకైన ప్రభుత్వం రాయితీపై బిందు సేద్యం పథకాన్ని అందిస్తుంది అన్నారు. ఐదు ఎకరాల కంటే లోపు ఉన్న రైతులకు 90శాతం ఐదు ఎకరాల కంటే పైనున్న రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్పు ఇస్తున్నామన్నారు పశుసంవర్ధక శాఖ అధికారి వైద్యులు దరీన్ బాబు మాట్లాడుతూ పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా 40 వేల నుండి 80 వేల వరకు రుణం పొందే అవకాశం ఉందని రైతులు సద్వి చేసుకోవాలన్నారు. అలాగే మీరు జాతికి చెందిన పశు వీర్యమును తక్కువ ధరకే రాయితీతో ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొని రైతుబంధు పథకం గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో రైతులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి భాదితులపట్ల వివక్ష తగదు

## చేంజెస్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.దుర్గా భవాని



**కాకినాడ.పెన్ పవర్ సెప్టెంబర్ 26 :** హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష చూపకుండా వారి పట్ల ఆదరణ చూపాలని చేంజెస్ ప్రాజెక్టు మేనేజర్ దాసరి దుర్గాభవాని అన్నారు. గురువారం పిఠాపురం రైల్వేస్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు అదేవిధంగా జిల్లా యూనిట్ ఆదేశాల మేరకు చేంజెస్ సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా? అనే అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఈ కార్యక్రమం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది? ఎలా వ్యాపించదు హెచ్ఐవి ఎయిడ్స్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు సుఖ వ్యాధుల గురించిన అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవి వ్యాధిగ్రస్తులతో మాట్లాడించి వారు క్రమబద్ధమైన జీవన విధానం ద్వారా ఎలా ఆరోగ్యంగా జీవిస్తున్నారు అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయడం జరిగింది. వ్యాధి సంక్రమించిన వారు కృంగిపోకుండా ఎలా సంతోషంగా తగిన జాగ్రత్తలు పాటిస్తూ జీవించవచ్చు అనే విషయాన్ని వివరించారు. సామాజిక మాధ్యమాల ద్వారా వీడియోలు మీన్స్ ద్వారా 1097 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. హెచ్ఐవి ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యాక్ట్- 2017 సక్రమంగా అమలయ్యేలా వారికి అవగాహన కల్పించారు.ఈ క్యాంపెయిన్ లో కమ్యూనిటీ సభ్యులు(యం.ఎస్.యం) సుశీల నాగ దుర్గ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## 50 వేలు చెక్కును కలెక్టర్ కి అందచేసిన స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు.


**వరద బాధితుల సహాయార్థం..**

**స్కూల్ విద్యార్థులను అభినందించిన కలెక్టర్.**



**కాట్రేనికోన ,పెన్ పవర్ సెప్టెంబర్ 26:** విజయవాడ వరద బాధితులకు ఆదుకోవ డానికి మానవీయ కోణంలో కోనసీమ జిల్లా విద్యార్థినీ విద్యార్థులు దాతృత్వంలో ముందుకు వచ్చి విరాళాలు అందిం చడం అభినందనీయమ ని జిల్లా కలెక్టర్ ఆర్ మహే ష్ కుమార్ తెలిపారు. గు రువారం స్థానిక కలెక్టరేట్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడి వరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన పోలిశెట్టి లక్ష్మి పార్వతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యా యులు మరియు ఉపాధ్యాయులు ద్వారా 50 వేల రూపాయల చెక్కును కోనసీమ జిల్లా కలెక్టర్ కి చేతుల మీదుగా వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వరద బాధితులను సానుకూల దృక్పథంతో ఆదుకోవ డానికి ముందుకు రావ డం హర్షణియమని తెలిపారు ఈ కార్యక్ర మంలో డివైఈవో జి. సూర్య ప్రకాశం ,కాట్రేనికోన ఎం ఈ ఓ 1 మరియు2 లు,స్కూల్ హెచ్ఎం ఏ శేష సాయి, స్కూల్ స్టాఫ్ మెంబర్స్,స్కూల్ చైర్మన్ పోలిశెట్టి వెంకట రాజు స్కూల్ వైస్ చైర్మన్ ఎం ఎస్ వర్మ చెయ్యేరు గ్రామ సర్పంచ్ చెల్లి సురేష్ మరియు వైస్ సర్పంచ్ బీవీ నారాయణ స్వామి చేయ్యేరు 1 ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల మహాలక్ష్మి. వార్డ్ మెంబర్ కాయల బలరాం తదితరులు పాల్గొన్నారు

# గుండెను భద్రంగా కాపాడుకోవాలి-వైద్యులు సుమంత్






**గోపాలపురం,పెన్ పవర్,సెప్టెంబర్ 26.** ప్రతి ఒక్కరూ తమ గుండెను ఎంతో భద్రంగా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ గుండె వైద్య నిపుణులు కడియం సుమంత్ అన్నారు.ఈనెల 29 వ తేదీన ప్రపంచ హృదయ దినోత్సవం కావడంతో దేవరపల్లిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.సుమంత్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్రామ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వైద్యులు సుమంత్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో హృద్రోగాలు ఎక్కువగా వస్తున్నాయన్నారు.దానికి ప్రధాన కారణం ప్రజలలో అవగాహన లోపమేనన్నారు.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోజుకు 30 నిమిషాలు కచ్చితంగా నడవాలన్నారు.వ్యాయామం చేయడం వల్ల శరీరం అలసటకు గురవుతుందన్నారు.అటువంటి సందర్భంలో ఈ వ్యాధి మన దరికిరాదన్నారు.అలాగే మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాలు మానుకోవాలన్నారు.కరోనా అనంతరం ఈ వ్యాధి ప్రబలిందని ప్రజలు అపోహ పడుతున్నారన్నారు.ప్రజల్లో అవగాహన లోపం ఉందన్నారు.శరీరంలో ఏదో ఒక అవయవంలో ఇబ్బంది ఏర్పడితే అది గుండెజబ్బుగా భావించి ప్రజలు మానసికంగా శారీరకంగా ఆందోళన చెంది విచ్చలవిడిగా మందులు వాడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని హితవు పలికారు. ప్రస్తుతం మార్కెట్లో స్మార్ట్ వాచీలు ఉన్నాయని వాటిలో మనం నడిచే నడకకు సంబంధించిన ఆప్షన్ ఉందని సద్వినిగం చేసుకోవాలన్నారు.ప్రతి ఒక్కరికి నడక ఎంతో ముఖ్యమన్నారు గుండె పదిలంగా ఉండాలంటే ప్రతినిత్యం నడవాలన్నారు.అలాగే కోపతాపాలు తగ్గించుకోవాలని కోపం వల్ల గుండెపై ఒత్తిడి పెరుగుతుందన్నారు.మానసిక ప్రశాంతత ఎంతో అవసరం అన్నారు.గతంలో గుండెకి సంబంధించిన ఇబ్బందులు ఎదురైతే సుదూర ప్రాంతాలు వెళ్లే పరిస్థితి ఉందన్నారు.వారు గమ్యానికి చేరేలోపే ఏదో ఒక ఇబ్బంది ఎదురయ్యేదన్నారు. మెట్ట ప్రాంతంలోని మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం దేవరపల్లిలో ఈ ఆసుపత్రి ఏర్పాటు చేశామన్నారు.ఎవరికి ఇటువంటి ఆరోగ్యపరమైన సమస్య ఎదురైన వెంటనే స్పందించి తక్షణ వైద్యం అందించడం జరుగుతుందన్నారు.ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా జరిగిన ర్యాలీని సుమంత్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ శరత్ చంద్రిక ప్రారంభించారు.కార్యక్రమంలో ,హర్షవర్ధన్, బిహెచ్ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు,ఆయా సంస్థల ప్రతినిధులు బాబి,ఆనంద్, ఆసుపత్రిలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు మంగ ప్రసాద్, ప్రశాంత్, బాల, ఆకాంక్ష, శ్రీకాంత్, దివ్య, మహేష్, మధు, సూర్యనారాయణ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నాయకులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజనం లేదు, కోడి గుడ్డే పెట్టా రంటున్న విద్యార్థులు





**వై రామవరం, పెన్ పవర్,సెప్టెంబర్ 26:** అధికారులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం కారణంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం లేకపోవడం, కోడి గుడ్డే పెట్టారని విద్యార్థులు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండలేదని విద్యార్థులు తెలిపారు. బియ్యం లేని కారణంగా గత రెండు రోజుల నుండి మధ్యాహ్న భోజనం వండించడం లేదన్నారు. ప్రతి విద్యార్థికి కోడుగుడ్డు ఇవ్వడంతో విద్యార్థులు రోడ్డుపై గుడ్డు తింటూ, భోజనం కోసం ఇండ్లకు పోతున్నారని పలువురు తెలిపారు. తరచూ ఇదే పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో ఆటంకాలు ఏర్పడుతున్నాయని స్థానికులు అంటున్నారు. మండల కేంద్రంలో ఇటువంటి పరిస్థితులు ఉంటే మారు మూల పాఠశాలల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటాయో నని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలను తనిఖీ చేయవలసిన సిఆర్పిలు, స్కూల్ కాంప్లెక్స్ అడ్మినిస్ట్రేటర్లు, ఎంఈఓ మండల కేంద్రంలో ఉన్న పాఠశాలనే తనిఖీ చేయకపోవడంఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మధ్యాహ్న భోజన పథకాన్ని కచ్చితంగా అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుచున్నారు.

# జెఎన్టియుకె లో వర్క్ షాప్






**కాకినాడ.పెన్ పవర్ సెప్టెంబర్ 26 :** జె ఎన్ టి యుకె యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ ( యునిక్ ) మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సెమినార్ హాలు నందు ఏఐసీటీఈ ప్రాయోజితంతో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ' అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్స్ ,మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెసస్ " అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్ షాప్ గురువారం ఉదయం ప్రారంభమైంది . ప్రారంభోత్సవ కార్యక్రమానికి రెక్టార్ ప్రొ . కె.వి. రమణ ముఖ్యఅతిధిగా విచ్చేయగా గౌరవ అతిథులుగా ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి. రవీంద్రనాథ్ . యుసిఐకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎస్.మోహన్రావు , రీసోర్స్పర్సన్ గా హైదరాబాద్ లోని మాజీ డైరెక్టర్ డా.ఎస్ . సాయికుమార్ లు విచ్చేశారు . మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.డి. లింగరాజు వర్క్ షాప్ కు అధ్యక్షత వహించగా డా.వి.జయప్రసాద్ – ఆర్డినేటర్ గాను , చా.వి. కళ్యాణ మనోహర్ కో - కోఆర్డినేటర్ గాను వ్యవహరిస్తున్నారు .ఈ సందర్భంగా రెక్టార్ ప్రొ.కె.వి. రమణ మాట్లాడుతూ భారతీయ భాషలకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు గాను ప్రాంతీయ భాషలతో ఎంసిలీ ఈ సహకారంతో పక్కెషాప్ లు నిర్వహించడం అభినంద నీయమన్నారు.రెండు తెలుగు రాష్ట్రాలలోని అధ్యాపకులకు,రీసెర్చ్ స్కాలర్లకు , విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఇటువంటి వర్క్ షాప్ లను నిర్వహించాలన్నారు . మెటీరియల్స్ రంగంలో సిలికాన్ , జెర్మేనియం రెండూ ప్రపంచాన్ని సాంకేతికంగా శాసిస్తున్నాయన్నారు .మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మెటీరియల్స్ రంగంలో అనేక అప్లికేషన్లు రూపొందించేందుకు అవకాశం ఉందని,వాటిని సద్వినియోగ పర్చుకుని ముందడుగు వేయాలన్నారు .ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ . వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలోని పరికరాలపై మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్లను ప్రత్యక్షంగా వివరించడంతో విద్యార్థులకు పూర్తి కలుగుతుం దన్నారు.ప్రస్తుత సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా ఇంజనీరింగ్ లోను, వైద్య రంగంలోను మెటీరియల్స్ యొక్క ప్రాముఖ్యత మరింత పెరిగిందన్నారు. రీకోర్సర్సన్లు అందించే విలువైన సమాచారాన్ని విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు.యుస్డె ప్రిన్సిపాల్ ప్రొ.ఎస్.మోహన్ రావు మాట్లాడుతూ ఇక్కడి లేబొరేటరీలలోని అధునాతన పరికరాలు ఉన్నాయని,వీటిని సద్వినియోగపర్చుకునేలా మరిన్ని ఏర్పాట్లుచేయాలన్నారు.రీసోర్స్ పర్సన్ డా.ఎస్.సాయికుమార్ మాట్లాడుతూ ఆధ్యాపకులు ఇటువంటి వాటి ద్వారా సంబంధిత సబ్జెక్టలలో నిష్ణాతులుగా మారడం ద్వారా విద్యార్థులకు ఉత్తమమైన బోధనను అందించగలరన్నారు .ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు , విభాగాధిపతులు,రీసోర్స్పర్సన్లు , జెఎన్టియుకె , అనుబంధ కళాశాలల ఆధ్యాపకులు,రీసెర్చ్ స్కాలర్లు ,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

# ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ లేదు, గళంమెత్తితే అరెస్టులు చేసేవారు

## - ఎమ్మెల్యే పితాని



**పెనుమంట్ర, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** గత ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు హరించారు, ప్రభుత్వంపై గళం మెత్తితే అరెస్టులు చేసే వారిని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం మార్టేరులో 100 రోజులు పూర్తయిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజా వేదిక నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ప్రజా సమస్యలు చెప్పుకుంటే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో వాలంటీర్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే మీకు సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని భయభ్రాంతులు చేసేవారని చేసేవారని గుర్తు చేశారు. వాళ్లు వాలంటీర్లు కాదు వైసిపి కార్యకర్తలని చెబుతున్న వారు లేకపోతే సంక్షేమ పథకాలు అందించాలని గొప్పలు చెప్పారని వారు లేకుండానే ఒక్క రోజులో 98% పింఛన్ల పంపిణీ చేసిన ఘనత చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని అన్నారు సచివాలయ సిబ్బంది వీఆర్ఏలు వీఆర్వోలు గ్రామపంచాయతీ సిబ్బంది వారికి తోడుగా కూటమి సైనికులు వీర సైనికులై పంపిణీలో భాగస్వామ్యం అయ్యారని చెప్పారు. ఎన్నికల్లో వాలంటీర్లు వైసీపీ ఏజెంట్లుగా ఓట్లు కొనడం వాస్తవం కాదా అంటూ ప్రశ్నించారు. వంద రోజుల పాలనలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి భూ యజమానికి భూమిపై హక్కు కల్పించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు, డ్వాక్రా మహిళలకు ఐదు లక్షల నుండి 10 లక్షల వరకు రుణాన్ని పెంచి ఇచ్చిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం కాదా అంటూ డ్వాక్రా మహిళలను అడిగారు. ఐదేళ్లలో ఒకటో తారీఖున ఉద్యోగులకు జీతాలు ఇచ్చిన పరిస్థితి లేదని కూటమి ప్రభుత్వం రాగానే ఒకటో తారీఖున ఉద్యోగుల జీతాలు చెల్లించిన ఘనత చంద్రబాబు పవన్ కళ్యాణ్ కి దక్కుతున్నాను. రాజధాని అమరావతి అని జగన్మోహన్ రెడ్డి మూడుముక్కలాటాడేరని విమర్శించారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కుటమిపాలన చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దీపావళికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తామని చెప్పారు. తొలిత గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం శిబిరాన్ని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తిలకించారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సత్తి సాయి ఆదినారాయణ రెడ్డి, సర్పంచ్ మట్టా కుమారి, వెలగల బుల్లి రామిరెడ్డి టిడిపి మండల అధ్యక్షులు తమరంపూడి శ్రీనివాస్ రెడ్డి, జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట్ కార్తీక్, బిజెపి మండల అధ్యక్షులు కేహెచ్వి ప్రసాద్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కర్రీ అచ్చుత రామరెడ్డి,గూడూరి మురళి, కోణాల శ్రీనివాసరెడ్డి, తాసిల్దార్ వై రవికుమార్, ఇన్చార్జ ఎంపీడీవో రాంప్రసాద్, జనసేన టిడిపి బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు గోదాముల భద్రతకై ప్రతిష్ట చర్యలు తీసుకోవాలి. కలెక్టర్.







**ముమ్మిడివరం, పెన్ పవర్ సెప్టెంబర్** ఎన్నికల రెవెన్యూ సిబ్బంది తది తర విభాగాల అధికా రులను ఆదేశించారుముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల మూడో అంతస్తు నందు ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వివి ప్యాట్ లను భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతిని ధులతో కలిసి గోదాముల యొక్క తాళాల సీల్లు పరిశీలించి అనంతరం గోదామును తనిఖి చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడు తున్న అన్ని చర్యలను పరిశీలించి, అధికారు లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల మేరకు ప్రతి త్రైమాసికానికి సం బంధించి ఈవీఎం, వీవీ ప్యాట్ గోదా మును క్షుణ్నంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపి స్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజ కీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలించడం జరుగు తుందని జిల్లా కలెక్టరు వివరించారు. ఈ కార్యక్ర మంలో రాజకీయ పార్టీల తరఫున ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వడ్డి నాగేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ముమ్మిడివరం తాసిల్దార్ ఎంవి సుబ్బలక్ష్మి, ఆర్. ఐ. పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది మంచి ప్రభుత్వమని ప్రజలే విశ్వసించారు: మంత్రి నిమ్మల






## పండుగ కానుకగా నిరుపేద కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు

**పోడూరు, పెన్ పవర్, సెప్టెంబర్ -26:** ఇది మంచి ప్రభుత్వమని ప్రజలే విశ్వసించారు కాబట్టే ప్రజలు భారీ సంఖ్యలో కార్యక్రమానికి బ్రహ్మరథం పట్టారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.యలమంచిలి మండలం కొంతేరులో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి రామానాయుడు హాజరై మాట్లాడారు. నిరు పేద ప్రజల కంట కన్నీరు తుడిచేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రభుత్వ వంద రోజుల పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ సాక్షాత్తు గ్రామ ప్రజలే ఇది మంచి ప్రభుత్వం అని మెచ్చు కోవడం శుభ పరిణామం అన్నారు.గత ప్రభుత్వం పనితీరు బాగోలేదు కాబట్టే ప్రజలను వంచించింది కాబట్టే గత పాలకులను ఇంటికి పంపించారని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం అయిదు ఏళ్ల పాలనా కాలంలో చేయని పనులను కూటమి ప్రభుత్వం కేవలం నెల రోజుల్లోనే చేసి చూపించిందని అన్నారు.ఇంకా అమలు చెయ్యవలసిన కార్యక్రమాలు దశలు వారీగా చేస్తామని మంత్రి అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకాన్ని మూడు వేల నుండి నాలుగు వేలకు పెంచి, దివ్యాంగులకు మూడు వేలు నుండి ఆరు వేలు (రెట్టింపు) పెంచి దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రం పింఛన్ల పంపిణీలో మొదటి స్థానంలో ఉందన్నారు.సూర్యోదయం సమయానికే ప్రతి ఇంటికి వెళ్ళి అందజేసామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్,మే, జూన్ నెల బకాయిలతో కలిపి జూలై 1వ తేదీన ప్రజలకు ఇంటి వద్దనే రూ ఏడు వేలు పెన్షన్ అదించామన్నారు. వాలంటీర్లు లేకపోయినా గ్రామ సచివాలయ ఉద్యోగులతో ఆగస్టు,సెప్టెంబరు మాసాలలో ఇంటివద్దనే ఒకటవ తేదీనే పెన్షన్లు అందించామని గుర్తుచేశారు.ఒక్కో సందర్భంలో ఒకటో తేదీ ఆదివారం వస్తే ముందురోజే అందించామన్నారు.గత ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా వదలకుండా ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిందన్నారు. రాష్ట్రాన్ని 14 లక్షల కోట్లు అప్పులు పెట్టి, ప్రతి వ్యక్తి నెత్తిమీద 2.40 లక్షలు అప్పులు పెట్టారన్నారు. గత ప్రభుత్వం యువతకు గంజాయి,మత్తు పదార్థాలు విచ్చలవిడిగా అందజేసి యువతను పెడత్రోవ పట్టించారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గంజాయి, మత్తుపదార్థాలపై ఉక్కు పాదం మోపామన్నారు. డీఎస్సీ ద్వారా 16,500 పోస్టులు భర్తీకి శ్రీకారం చుట్టామని,రానున్న ఐదేళ్లలో యువతకు 20 లక్షలు ఉద్యోగాలను కల్పిస్తామన్నారు.టిడ్కో ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని వివరించారు. ప్రజల్లో వెలుగులు నింపేందుకు దీపావళి రోజు నుండే ఉచిత గ్యాసు సిలిండర్లు అందజేస్తామన్నారు. వంద రోజుల్లో చాలా మంచి పనులు చేశామని,రాబోయే రోజుల్లో మరిన్ని మంచి పనులు చేసి ప్రజల మన్ననలు అందుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో సమర్థుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నాడని, ఆయనకు తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నారని, సహాయ సహకారాలు అందించుటకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉన్నారని, రాష్ట్రభివృద్ధికి ఎటువంటి డోకా లేదన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, తదితర ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని, ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రం నిధులు కొరత ఉన్నను ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చి తీరుతామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు అన్నారు. ఆరుగురు గర్భిణీలకు సాముహిక సీమంతాలు చేసి, చీర, గాజులు, పసుపు, కుంకుమ, తదితర వాటిని అందించి గర్భిణీ స్త్రీలను మంత్రి ఆశీర్వదించారు.పౌష్టికాహార మాసోత్సవాలు సందర్భంగా ఎగ్జిబిషన్ స్టాల్ ను మంత్రి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.వెంకట రమణ,తహశీల్దారు బాజీ సత్యనారాయణ, యంపిడివో యన్.ప్రేమా అన్విత, మండల వివిధ శాఖలు అధికారులు, నాయకులు జీవి, పెచ్చెట్టి బాబు,ఉన్నమట్ల కబర్థి, మామిడిశెట్టి పెద్దిరాజు, బొప్పన హరి కిషోర్, కొడవటి వరబాబు, బోణం నాని,కడలి గోపాల రావు, తాళ్ళ నాగ రాజు, మాత రత్నంరాజు, పాలవలస తులసీ రావు, పీతల శ్రీనివాసు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, రైతులు,ప్రజలు, మహిళలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు.

# కూటమి సభ్యుల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ





కాజులూరు,పెన్‌పవర్,సెప్టెంబర్26: మండల పరిధిలోని దుగ్గుదుర్రు గ్రామ పంచాయతీ మేకల గరువులో గురువారం కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు
.రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల పాలనలో చేసిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను కూటమి నాయకులు పోతు జ్యోతికుమార్ ప్రజలకు వివరిస్తూ ప్రభుత్వ స్టిక్కర్లను గోడలపై అతికించారు.
అలాగే రామచంద్రపుం 28వ వార్డు చింతపల్లి సూరన్ననగర్‌లో కూటమి నాయకులు గుబ్బల ఏసురాజు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.
ఈ కార్యక్రమంలో దుగ్గుదూరు పంచాయతీ సిబ్బంది శ్రీరాం, కూటమినాయకులు పాల్గొన్నారు.

# ఓ గిరిజన గర్భిణీ అవస్థలు





**వై రామవరం / అడ్డతీగల,పెన్ పవర్ సెప్టెంబర్ 26:**అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం పింజరి కొండ గ్రామానికి చెందిన ఓ గర్భిణీ పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పింజరి కొండ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం, గర్భిణీ ఆసుపత్రికి వెళ్లడం కోసం పడుతున్న అవస్థలు. పింజరి కొండ కాలువను ప్రమాదపు టంచుల్లో ప్రాణభయంతో దాటుచున్న సంఘటన ఇది. ఓ స్త్రీ మూర్తి బిడ్డకు జన్మనివ్వడం కోసం మరో జన్మనెత్తవలసి వస్తున్న పరిస్థితి. బిడ్డను కనాల్సిన ఆ తల్లి ఓ వ్యక్తి భుజాన బిడ్డయి ప్రమాదపుటంచు న ప్రసమార్గానికి పయనిస్తున్న సంఘటన అమోఘం. స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్న గిరిజనులకు మాత్రం స్వాతంత్ర్యం రాలేదని చెప్పవచ్చు అని పలువురు అంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజన బ్రతుకుల్లో మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆకట్టుకున్న సెల్ఫీ విత్ స్వచ్ఛత స్పాట్




**పెద్దాపురం / సామర్లకోట, పెన్ పవర్, సెప్టెంబర్ 26 :** సామర్లకోట పట్టణ పరిధిలోని స్థానిక అయోధ్య రామపురంలో గల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్వచ్ఛత సెల్ఫీ స్పాట్ విశేషంగా ఆకట్టుకుంది. స్వచ్ఛతే హే సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఈ సెల్ఫీ స్పాట్ ఏర్పాటు చేసినట్లు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ శ్రీవిద్య, వార్డ్ కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్, ఏస్ఎంసి చైర్మన్ అక్కిన చక్రధర్ లు ఈ సెల్ఫీ స్పాట్ సందర్శించి హెచ్ఎంను అభినందించారు.

# ఆకట్టుకున్న స్వచ్ఛత ఎగ్జిబిషన్





**పెద్దాపురం / సామర్లకోట, పెన్ పవర్, సెప్టెంబర్ 26 :** విద్యార్థి దశ స్థాయి నుంచి పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత సమాజంపై అవగాహన కల్పిస్తే కాలుష్యరహిత సమాజం సాధ్యమవుతుందని సామర్లకోట మున్సిపల్ కమీషనర్ శ్రీవిద్య పేర్కొన్నారు. స్వచ్ఛతే హే సేవా కార్యక్రమంలో భాగంగా సామర్లకోట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక అయోధ్య రామపురంలో గల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చెత్త నుంచి సృజనాత్మకత పేరుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్ కు మున్సిపల్ కమీషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రిపుల్ ఆర్ అనగా రెడ్యూస్, రీసైకిల్, రీయూస్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాత పేపర్లు, అట్ట ముక్కలు, గుడ్డు పెంకులు, తదితర నిరూపయోగ వస్తువులతో పట్టణంలో నాలుగు మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సృజనాత్మకతతో చేసిన పలు వస్తువులతో పాటు ఎంతగానో సేవ్ గర్ల్ చైల్డ్ పై విద్యార్థుల డ్రాయింగ్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ముఖ్య అతిథులు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ బలుసు వాసు, పాఠశాల హెచ్ఎం, ప్రోగ్రాం కన్వీనర్ తోటకూర సాయి రామకృష్ణ, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, హెచ్ఎంలు యు. సత్యనారాయణ, టి. శ్యాంసుందర్, పి. కాశీ విశ్వనాథం, శానిటరీ ఇనస్పెక్టర్ రాజశేఖర్, సన్యాసిరాజు, ఓదూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు వి. రాజు, జి. గోవిందు, కె. అరుణ, కె.వి.వి. సత్యనారాయణ, ఏ.ఎల్.వి కుమారి, శేషసాయి, ఆయా పాఠశాలల క్రాఫ్ట్ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.